సాక్షి కామారెడ్డి
మంగళవారం । 17 । జనవరి । 2023



ఆలయాల్లో పూజలు

శివదీక్షలు స్వీకరించినవారు సోమవారం ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

- 9లో ▸



సబ్‌స్టేషన్ ముట్టడి

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతుండడంతో విద్యుత్ ఉపకరణాలు దెబ్బతింటున్నాయంటూ జంగంపల్లివాసులు సబ్‌స్టేషన్ ముట్టడించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /18.5

వాతావరణం

ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

‘బీఆర్‌ఎస్‌ను దెగ్లూర్‌లో విస్తరించండి’



బాన్సువాడ టౌన్: మహారాష్ట్రలోని దెగ్లూర్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సోమవారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. దెగ్లూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీని విస్తరించాలని కోరారు. బహిరంగ సభ ఏర్పాటు చేసి తాము బీఆర్‌ఎస్‌లో చేరతామని పేర్కొన్నారు. కౌన్సిలర్లకు స్పీకర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి స్వయం ఉపాధి శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం నుంచి ఉచిత స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ‘మగ్గం వర్క్, టైలరింగ్ (కుట్టుమిషన్), బ్యూటీపార్లర్ కోర్సుల్లో 30 రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి కావాల్సిన మెటీరియల్, బుక్స్, యూనిఫాం అందిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా వ్యాపార అభివృద్ధి మెళకువలు, వ్యక్తిత్వ వికాసం, యోగా తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తారన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 35 ఏళ్ల వయస్సు గల గ్రామీణ యువతులు ఉచిత శిక్షణకు అర్హులని డైరెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ మెమో, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి సమాచారం కోసం ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ, డిచ్‌పల్లి సంస్థలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 08461 222428, 08461 295428 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఫోన్ రికవరీకి వెళ్తే చితకబాదారు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాందేవ్‌వాడలోని టిఫిన్ సెంటర్‌లో ఓ యువకుడి సెల్‌ఫోన్ చోరీ జరిగింది. బాధితుడు మూడో టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సీడీఆర్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన వారిలో శ్రీనివాస్, గణేశ్, అజయ్‌లు ఉన్నట్లు తెలుసుకొని శుక్రవారం రాత్రి ఐడీ పార్టీ కానిస్టేబుల్ వారి వద్దకు వెళ్లారు. సెల్‌ఫోన్ ఇవ్వాలని కానిస్టేబుల్ వారిని కోరినా ఇవ్వలేదు. పైగా ముగ్గురు కలిసి కానిస్టేబుల్‌ను చితకబాదారు. కానిస్టేబుల్‌కు గాయాలవడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను సంప్రదించగా సెల్‌ఫోన్ పోయిందని కేసు నమోదు చేశామని, ఫోన్ కోసం వెళ్లిన కానిస్టేబుల్‌ను గాయపర్చిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

‘మళ్లీ పోరాటం చేస్తాం’



ఆర్మూర్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు పంటకు మద్దతు ధర కల్పించే వరకు మళ్లీ పోరాటం చేస్తామని గత లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేసిన పసుపు రైతులు పేర్కొన్నారు. పసుపు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్మూర్‌లోని మార్కెట్ యార్డులో సోమవారం రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం క్వింటాలు పసుపు పంటకు రూ. 15 వేలు ధర ఉండగా ప్రస్తుతం రూ. 4వేల నుంచి రూ. 6వేలకు మించి లభించకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేయాలన్నారు. పక్క రాష్ట్రాల్లో క్వింటాలుకు అదనంగా రూ. 3వేలు ఇస్తున్న విధంగా తెలంగాణలోనూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పసుపు పంటకు మద్దతు ధరలేక రైతులు నష్టపోతున్నారన్నారు. మద్దతు ధర విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీని ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వాలు స్పందించి తక్షణమే పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రవీణ్ రెడ్డి, సురేష్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, చంటి లింగారెడ్డి, గంగారెడ్డి, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు వేళాయె!

- రేపటినుంచి రెండో విడత ప్రారంభం
- 19 నుంచి ఊరూరా శిబిరాలు
- జిల్లాలో 606 క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు
- 10.90 లక్షల మందికి పరీక్షలు లక్ష్యం..
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించనుంది. 19 నుంచి గ్రామాలవారీగా క్యాంపులను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. జూన్ 15 వరకు శిబిరాలు కొనసాగుతాయి. జిల్లా జనాభా 10,90,713 కాగా.. అందరినీ శిబిరాలకు రప్పించి కంటి పరీక్షలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 526 పంచాయతీలు, మూడు మున్సిపాలిటీలున్నాయి. అన్ని ప్రాంతాలలో కంటివెలుగు శిబిరాలు నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. అన్ని పంచాయతీలతోపాటు పట్టణాల్లో వార్డుల వారీగా కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 526 పంచాయతీలతోపాటు కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులు, ఎల్లారెడ్డిలో 12 వార్డులు, బాన్సువాడలో 19 వార్డుల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 148 క్యాంపులు, ఎల్లారెడ్డిలో 218, బాన్సువాడలో 107, జుక్కల్‌లో 113 క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కంటి పరీక్షల కోసం అవసరమైన యంత్రాలు, సామగ్రి జిల్లాకు చేరుకున్నాయి.

ఒక్కో శిబిరంలో 2 వందల మందికి...

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 9,16,408 మందికి, పట్టణ ప్రాంతాల్లో 1,74,305 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రోజు గ్రామీణ ప్రాంతాల్లోని శిబిరాల్లో 2 వందల మందిని, పట్టణ ప్రాంతాల్లో 3 వందల మందిని పరీక్షించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య బృందాల సభ్యులు శిబిరాల్లో అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహిస్తారు. గ్రామాల్లో జనాభా ఆధారంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. రోజుకు 2 వందల మంది చొప్పున పరీక్షలు చేపట్టడం ద్వారా ఆ గ్రామంలో పరీక్షలు పూర్తయ్యేదాకా క్యాంపులు కొనసాగనున్నాయి. తర్వాత ఇతర గ్రామాలకు వెళతారు. కాగా 2018లో తొలి విడత కంటి వెలుగు నిర్వహించారు. ఆగస్టు 15 నుంచి సుమారు ఆరు నెలల పాటు కార్యక్రమం కొనసాగింది. అప్పట్లో కొందరికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తామని చెప్పినా.. ఇప్పటివరకు దాని ఊసేలేదు.



కంటివెలుగుపై జిల్లా అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బృందాల ఏర్పాటు..

కంటి వెలుగు పరీక్షల నిర్వహణ కోసం వైద్యాధికారి, సీహెచ్‌వో, హెల్త్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆశ కార్యకర్తలతో బృందాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కంటి వెలుగుపై జిల్లా యంత్రాంగం విస్తృత ప్రచారం చేపట్టింది. ప్రతి పల్లెలో క్యాంపులు నిర్వహిస్తుండడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే క్యాంపులకు అందరూ వచ్చేలా పంచాయతీలు, మున్సిపాలిటీల పాలకవర్గాలు, అధికారులు చొరవ చూపితేనే కార్యక్రమం విజయవంతం అయ్యే అవకాశాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కంటి వెలుగు ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం వార్డుల వారీగా శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. శిబిరాల వద్ద ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పట్టణాల్లో ఏర్పాటు చేసే కంటి వెలుగు శిబిరాల ద్వారా రోజూ 300 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే శిబిరాలలో 200 మందికి పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వయం సహాయక బృందాలు, అంగన్‌వాడీ టీచర్ల సహాయంతో కంటివెలుగును సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శిబిరాలు ముగిసే వరకు పరీక్షించిన వారి వివరాలను రోజు నివేదించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

పకడ్బందీగా అమలు చేయాలి

కామారెడ్డి క్రైం: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వి, కమిషనర్ శ్వేతలతో కలిసి కంటి వెలుగు క్యాంపుల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రత కల్పించాలని సూచించారు. జిల్లాలలో జనవరి 19న ఉదయం 9 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచులు వారి పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. వీసీలో కామారెడ్డినుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను ఆహ్వానించండి

కామారెడ్డి క్రైం: కంటి వెలుగు శిబిరాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటి వెలుగుపై సమీక్షించారు. కార్యక్రమానికి ప్రజలు హాజరయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. శిబిరాల వద్ద గొడవలు జరగకుండా ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లను పంచాయతీ, మున్సిపల్ అధికారులు పూర్తిచేయాలన్నారు. జిల్లాకు ఇప్పటివరకు 41,130 కంటి అద్దాలు వచ్చాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, వైద్యులు, డీఎల్‌పీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఏసీడీ చార్జీలు చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: విద్యుత్ వినియోగదారులు గతేడాది వినియోగించిన అదనపు కరెంట్ వినియోగంపై ఏసీడీ చార్జీ చెల్లించాల్సి ఉంటుందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల అదనపు బిల్లు రావడంతో అనేక మంది వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్‌ఈ రమేష్‌బాబు వివరణ ఇచ్చారు. గతేడాది వినియోగించిన విద్యుత్ యూనిట్లను సరాసరి లెక్కించి రెండు నెలల డిపాజిట్‌ను ఏసీడీగా జనవరి నెల బిల్లులో చూపించామని పేర్కొన్నారు. కొత్త సర్వీస్ కనెక్షన్ ఇచ్చినపుడు కిలోవాట్ లోడ్‌కు రూ.200 సెక్యూరిటీ డిపాజిట్‌గా వసూలు చేస్తామని, ఆ తర్వాత వినియోగాన్ని బట్టి ఏటా ఏసీడీని లెక్కించి బిల్లు విధిస్తామని వివరించారు. ఏసీడీ డిపాజిట్‌గా ఉంటున్నందున ఇంటి యజమాని ఈ చార్జీని చెల్లించాలని సూచించారు. ఏసీడీపై ఎలాంటి సందేహాలున్నా ఈఆర్‌వో కౌంటర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

‘దరఖాస్తు చేసుకోండి’

కామారెడ్డి అర్బన్: విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే పేద మైనారిటీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్ సూచించారు. ఈ విషయమై ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, పార్సీ విద్యార్థులు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షికాదాయం రూ. 5లక్షలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 80969 73346 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతు ఉద్యమం.. ఉధృతం

- మాస్టర్ ప్లాన్‌పై వెనక్కి తగ్గని బాధితులు
- కౌన్సిలర్ల రాజీనామాకు డిమాండ్
- రేపు రాజీనామా చేస్తామన్న బీజేపీ కౌన్సిలర్లు
- అధికార పార్టీ కౌన్సిలర్లపై పెరుగుతున్న ఒత్తిడి
- నేడు పాత రాజంపేటలో బాధిత రైతుల సమావేశం



మున్సిపల్ కార్యాలయం వద్ద ముగ్గుతో నిరసన తెలుపుతున్న రైతులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో బాధితులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదివారం పండుగ రోజూ నిరసన కొనసాగించారు. 20వ తేదీలోగా విలీన గ్రామాల కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలని, లేకపోతే ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. కాగా బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు రాజీనామాకు ముందుకు రావడంతో అధికార పార్టీకి చెందినవారిపై ఒత్తిడి పెరుగుతోంది. బీజేపీకి చెందిన రామేశ్వరపల్లి 2వ వార్డు కౌన్సిలర్ సుతారి రవి, 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్‌లు రైతులు విధించిన గడువుకంటే రెండు రోజుల ముందే అంటే ఈనెల 18న తమ పదవులకు రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. రైతుల పక్షాన నిలుస్తామని, మాస్టర్ ప్లాన్ రద్దు చేసేంతవరకు ఉద్యమంలో ఉంటామని స్పష్టం చేశారు.

అయోమయంలో అధికార పార్టీ కౌన్సిలర్లు

అధికార పార్టీకి చెందిన 1వ వార్డు(అడ్లూర్) కౌన్సిలర్ గడ్డమీది రాణి, 6వ వార్డు(పాతరాజంపేట) కౌన్సిలర్ ఆకుల రూప, 9వ వార్డు(లింగాపూర్) కౌన్సిలర్ పడిగే సుగుణ, దేవునిపల్లికి చెందిన 10, 12, 35 వార్డుల కౌన్సిలర్లు ఉర్దొండ వనిత, కాసర్ల గోదావరి, పోలీస్ కృష్ణాజీరావు, 13వ వార్డు(టేక్రియాల్) కౌన్సిలర్ శంకర్‌రావులపై ఒత్తిడి పెరుగుతోంది. వీరంతా ఈనెల 20వ తేదీలోగా రాజీనామా చేసి, మాస్టర్ ప్లాన్ రద్దు డిమాండ్‌కు మద్దతు తెలపాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాజీనామా చేయని కౌన్సిలర్ల ఇళ్లను ముట్టడిస్తామని ఇప్పటికే ప్రకటించారు. బీజేపీ కౌన్సిలర్లు రాజీనామా చేస్తామని ప్రకటించడంతో అధికార పార్టీ కౌన్సిలర్లు ఆయోమయంలో ఉన్నారు.

పోలీసు నిఘా

రైతుల ఉద్యమంపై పోలీసులు నిఘా పెట్టారు. రైతులు చేస్తున్న ఆందోళనలను వీడియో తీస్తున్నారు. పోలీసుల తీరుపై రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఉగ్రవాదులం కాదని, పంటలు పండించుకునే రైతులమని పేర్కొంటున్నారు. శాంతియుతంగానే నిరసనలు కొనసాగిస్తున్నామన్నారు.



నిరసనలను వీడియో తీస్తున్న పోలీసులు

పండుగ పూటా కొనసాగిన నిరసన



రోడ్డుపై ముగ్గులు వేస్తున్న బాధితులు

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆదివారం సంక్రాంతి పండుగ పూటా ఆందోళన కొనసాగించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపైన ముగ్గులు వేసి నిరసన తెలిపారు. బాధిత రైతులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి సుభాష్, జేపీఎన్, సిరిసిల్ల రోడ్, పాత బస్టాండ్, స్టేషన్‌రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, ఎన్‌హెచ్–7, కొత్తబస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రోడ్లపై ముగ్గులు వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్లపైనే ఉన్నారు. రైతు కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని కోరారు. బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు మద్దతు తెలిపారు.

భవిష్యత్ కార్యాచరణపై సమావేశం..

పాత రాజంపేటలోని పోచమ్మ గుడి వద్ద మంగళవారం ఎనిమిది గ్రామాలకు చెందిన మాస్టర్ ప్లాన్ బాధితులు సమావేశమవ్వాలని నిర్ణయించారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై ఇందులో చర్చించనున్నారు. రైతులు ఎలాంటి కార్యాచరణ ప్రకటిస్తారోననే అంతటా ఉత్కంఠ నెలకొంది.

‘సొంతూరులో పండుగ.. గొప్ప అనుభూతి’



విజేతలకు బహుమతులు అందిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్: దేశ విదేశాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డా పండుగ సమయంలో సొంతూరుకు వచ్చి పర్వదినాన్ని అందరి మధ్య జరుపుకోవడం గొప్ప అనుభూతిని ఇస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామంలో జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబురాలు సోమవారం ముగిశాయి. గ్రామంలో వాలీబాల్, ముగ్గుల పోటీ, చెంచాగోళీ, మ్యూజికల్ చైర్, రన్నింగ్, షటిల్ తదితర ఆటల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు మారుపేరుగా ఉన్న రైతునగర్ గ్రామంలో ఏటా సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహిస్తారన్నారు. సొంతూరుపై ఉన్న మమకారంతో చాలా మంది దేశ విదేశాల నుంచి వచ్చి పండుగలో పాల్గొంటుండడం అభినందనీయమన్నారు. పండుగల గురించి పిల్లలకు వివరించడం తల్లిదండ్రుల బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, గంగాప్రభుదాస్, ద్రోణవల్లి అశోక్, రఘు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీబీపేటలో వేసిన ముగ్గు, పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా చేసిన అలంకరణ

సంబురం

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని సంబురంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే వాకిళ్లలో కల్లాపి చల్లి, అందమైన ముగ్గులు వేశారు. మహిళలు నోములు నోచుకుని, వాయినాలు ఇచ్చుకున్నారు. పిండి వంటలు చేసుకుని ఆరగించారు. పిల్లలు, యువత గాలిపటాలను ఎగురవేస్తూ సందడిగా గడిపారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ బ్యాక్‌లాగ్, రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నిశిత డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒకరు, ఆర్మూర్ సిద్దార్థ డిగ్రీ కళాశాలలో మరొకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 2851 మంది విద్యార్థులకు 2672 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టరు రెగ్యులర్ పరీక్షల్లో 9846 మంది విద్యార్థులకు 8940 మంది హాజరయ్యారు.

వలకు చిక్కిన పది కిలోల చేప



నిజాంసాగర్: మండలంలోని సింగితం రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన బెస్త సిద్దప్పకు సోమవారం పది కిలోల చేప చిక్కింది. రిజర్వాయర్‌లో వలకు భారీ బొచ్చ చేప చిక్కడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ చేప ధర రూ.1200 వరకు ఉంటుందని పేర్కొంటున్నారు.

సీఎస్‌ను కలిసిన ఆకుల లలిత



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర చీఫ్ సెక్రెటరీగా నియమితులైన శాంతికుమారిని సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కె భవన్‌లో టీఎస్ డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యానంద్



సత్యానంద్

నిజామాబాద్‌అర్బన్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా డి సత్యానంద్ నాలుగో సారి ఎన్నికయ్యారని జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగుడలో జరిగిన రాష్ట్ర మహాసభలో సత్యానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా రమేష్ ఎన్నికయ్యారు.

ఢిల్లీలో సంక్రాంతి వేడుకల్లో మిమిక్రీ శంకర్ సందడి



ఇందల్వాయి: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్‌భవన్‌లో మధుశాస్త్రి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మిమిక్రీ ఆర్టిస్ట్ శంకర్ పాల్గొన్నారు. వేడుకల్లో శంకర్ వెంట్రిలాకిజమ్ కళతో సందడి చేశారు.

మొరం ట్రాక్టర్ల సీజ్

నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులోని ప్రాణహిత ప్రాజెక్టుకు చెందిన మొరం అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైనింగ్ ఏడీ సత్యనారాయణ సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కమలాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి తన ట్రాక్టర్లలో మొరం తరలించాడని చెప్పారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

పరిశ్రమలకు త్వరితగతిన అనుమతి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి: ప్రభుత్వం టీఎస్ ఐ పాస్ ద్వారా త్వరితగతిన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతించడం ద్వారా ఆగ్రో ఇండస్ట్రీల ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కోటగిరిలోని ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అలాగే మల్కాపూర్ శివారులో లక్ష్మీబాలాజి రైస్ మిల్లును ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైస్ మిల్లుల సంఖ్య మూడింతలు పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు. టిఎస్ ఐపాస్ ద్వారా రాష్ట్రంలో 20 వేల లఘు, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, వీటి ద్వారా 18 లక్షల మంది సాంకేతిక నిపుణులకు, ఐటీ కంపెనీల ద్వారా 6 లక్షల మందికి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఉద్యోగాలు లభించాయని పోచారం వెల్లడించారు. నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల పునర్వ్యవస్థీకరణ కోసం రూ.150 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. శంకర్ పటేల్, వల్లేపల్లి శ్రీనివాస్, కల్లూర్ సిరాజ్, ఎజాజ్ ఖాన్, అబ్దుల్ హమీద్, సలీం, జుబేర్, అనిల్ కులకర్ణి, బర్ల మధు, పి సాయిలు, బి రాములు, ఎండీ ఎజాజ్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడటౌన్: బాన్సువాడలో వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే కబడ్డీ పోటీల ఏర్పాట్లను సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బాన్సువాడ మినీ స్టేడియంలో కీ.శే. పరిగె రాజిరెడ్డి స్మారక కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి 16 జట్లు కబడ్డీ పోటీల్లో తలపడనున్నాయి. పోటీల నిర్వహణపై ప్రజాప్రతినిధులతో స్పీకర్ చర్చించారు. ఈ నెల 20 నుంచి అర్చరీ, బాడ్మింటన్, కబడ్డీ పోటీలపై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నాట్లు ఆయన వివరించారు. పోచారం శంభూరెడ్డి, అంజిరెడ్డి, గంగాధర్, కృష్ణరెడ్డి, ఏజాస్, గురువినయ్ ఉన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఖలీల్‌వాడి: ప్రజావాణికి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 21 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ చంద్రశేఖర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పీ సీఈవో గోవింద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలన జరిపి, ప్రజావాణి సైట్‌లో వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పలు అంశాలపై సూచనలు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31 వరకు కొనసాగనున్న జంతు సంరక్షణ పక్షోత్సవాల కరపత్రాలను అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు తెలిపారు. రోడ్లపై సంచరించే మూగజీవాలకు తగిన ఆవాసం కల్పిస్తూ, మేతను అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి పాల్గొన్నారు.

కామారెడ్డిలో 12 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చాయి. ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వారి శాఖల వానీగా స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్


- భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్

ఖలీల్‌వాడి: ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం – సామాజిక న్యాయం సవాలుపై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయాలన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కూడా రిజర్వేషన్ కల్పించే విధంగా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐటీ సీలింగ్ రూ.10 లక్షలకు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఆందోళన చేస్తామని, రిజర్వేషన్ కాపాడాలంటే పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన ఖాళీలను భర్తీ చేయాలన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. 30 ఏళ్లు పనిచేసిన ఉద్యోగికి సీపీఎస్‌తో పెన్షన్ ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాల రాస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి సంఘం అమృత్ కుమార్, కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకటరెడ్డి, సాయిలు, టి దయానంద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నవీపేట: మండలంలోని అంజుమాన్ ఫారమ్ గ్రామంలో ఆదివారం రాత్రి స్పెషల్ టాస్క్ ఫోర్స్, నవీపేట పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.2500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి



భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంతంపల్లి గ్రామానికి చెందని ఒక్కరు మృతి చెందారు. ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కర్రోల్ల బాలయ్య (44) గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం భిక్కనూరుకు బైక్‌పై వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని గ్రామానికి వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గయపడ్డ బాలయ్యను టోల్‌ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలయ్య అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నగర శివారు మాధవనగర్ వేణు గోశాలలో గోవులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల టీటీడీ ఆర్గనైజర్ వేదాంత సీతారామచంద్రమూర్తి మాట్లాడుతూ.. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిజామాబాద్ జిల్లాశాఖ తరపున మన గుడిలో భాగంగా టీటీడీ ఈవో ఆదేశాల మేరకు జిల్లాలోని పలు దేవాలయాలు, గోశాలలో గోమాతలకు పూజలు నిర్వహించామన్నారు. చిరంజీవాచార్యులు, కార్పొరేటర్లు ప్రమోద్, సౌజన్య, హిందూ ధర్మ ప్రచార మండలి, ఇందూర్ యజ్ఞ సమితి అధ్యక్షుడు మూడ నాగభూషణం గుప్త, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు



విద్యుత్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గ్రామస్తులు సోమవారం ముట్టడించారు. గంటపాటు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. గ్రామంలోని వాసవీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం వేకువజామున కాలిపోయింది. దీంతోపాటు ఆ ప్రాంతంలో ఉన్న టీవీలు, ట్యూబ్‌లైట్లు, బల్బులు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యుత్ అధికారులు నూతనంగా వేస్తున్న విద్యుత్ తీగలకు సంబంధించిన పనులను నిలిపివేయించి సబ్‌స్టేషన్ వద్దకు తరలివెళ్లారు. మూడు నెలల్లో ఆరుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దీంతో తమ ఇండ్లలో ఉన్న విద్యుత్ వస్తువులు కూడా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ సిబ్బంది ఏఈ రామలక్ష్మికి సమాచారం అందించారు. విద్యుత్ సరఫరాలో తేడాలు రావడంతోనే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతుందని ఆమె చెప్పారు. తమ ఇళ్లలో కాలిపోయిన వస్తువులకు పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఏఈ రామలక్ష్మి మరోసారి ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

కల్లుసీసాలో ఎలుక!

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట కల్లు దుకాణంలో సోమవారం కల్లుసీసాలో కుళ్లిన స్థితిలో ఎలుక ప్రత్యక్షమైంది. దీంతో కల్లుప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కల్లు దుకాణాన్ని మూసివేయించారు. కల్లుదుకాణదారులపై చర్యలు తీసుకునేంత వరకు గ్రామంలో కల్లును విక్రయించకూడదని వారు డిమాండ్ చేశారు. ఎలుక పూర్తిగా కుళ్లిపోవడంతో సీసాలోని కల్లు రంగు సైతం మారిపోయింది. ఈ విషయం గురించి కల్లుప్రియులు దుకాణదారులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వారు ఆరోపించారు. ఎలుక వచ్చిన కల్లుసీసాను సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పు చేసినట్లు నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమే



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

బోధన్ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విషయంలో తనెలాంటి తప్పు చేయలేదని, ఒక వేళ తాను తప్పుచేసినట్లుగా నిరూపిస్తే ఉరిశిక్ష కైనా సిద్ధమేనని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ పేర్కొన్నారు. తాను పెట్టుబడి లేకుండా నాలుగు రైసమిల్లులు పెట్టానని, రూ.120 కోట్ల వరిధాన్యం మేరకు సీఎంఆర్ వాపస్ ఇవ్వలేదని, రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వ లేదని అవాస్తవ ఆరోపణలతో తనపై వార్తలు (సాక్షికాదు) వచ్చాయన్నారు. తన రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం, వాపస్ చేసిన సీఎంఆర్ వివరాలు అధికారికంగా నిర్ధారించుకోవాలన్నారు. మైనారిటీ సామాజిక వర్గం ఎమ్మెల్యేగా ఉన్నందున తనపై ప్రతి రెండు, మూడు నెలకొకసారి ఏదో తప్పుడు ఆరోపణలు చేసి ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారని అన్నారు. బోధన్‌లోని తన క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే సోమవారం మీడియాతో మాట్లాడారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లయ్ రాష్ట్ర కమిషనర్‌ను తాను ఫోన్‌లో సంప్రదించి వెంటనే రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు చేయించి వాస్తవాలను అధికారికంగా ప్రజల ముందుంచాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు స్పందించి కలెక్టర్ ఆరు సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారుల బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారని చెప్పారు. కొన్ని నెలల క్రితమే ఎఫ్‌సీఐ అధికారులు రెండు సార్లు తనిఖీలు చేశారని పేర్కొన్నారు.

‘ఎక్సైజ్’ ఘటనపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి: గుడుంబాతో దొరికిన ఓ మహిళ పారిపోయేలా ఎస్‌హెచ్‌వో సైగలు చేయడంపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ‘ఎక్సైజ్‌లో దొంగాట’ శీర్షికన సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం స్పందించారు. ఈ ఘటనపై విచారణ చేయాలని సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్‌ను ఆదేశించారు. నిందితురాలును ఫొటో తీసుకొని పారిపోయే విధంగా సైగలు చేయడంపై విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఎస్‌హెచ్‌వో మమత వద్ద పని చేస్తున్న ప్రైవేట్ డ్రైవర్ భరత్‌ను మూడు రోజుల క్రితం తొలిగించినట్లు తెలిసింది. కాగా సదరు డ్రైవర్ తన స్నేహితులతో కలిసి నిందితురాలు ఇంటికి వెళ్లి వీడియో తీసినట్లు తెలిసింది. గుడుంబాతో దొరికిన మహిళ వద్దకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ యూనియన్ నేతలు వెళ్లి వివరాలను సేకరించినట్లు తెలిసింది. డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు తన వద్దకు వచ్చినట్లు ఆమె యూనియన్ నేతల దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం మాట్లాడుతూ డ్రైవర్ భరత్‌ను తొలిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ చెప్పారన్నారు. గుడుంబాతో దొరికిన మహిళ ఇంటికి డ్రైవర్ మరో ఇద్దరు వెళ్లినట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ ఘటనపై విచారణకు ఆదేశించానని తెలిపారు.

ఇసుక వేలంపాట

రెంజల్(బోధన్): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఇసుక వేలంపాట నిర్వహించారు. ఇటీవల ఒక టిప్పర్‌లో ఇసుక అక్రమ రవాణ చేస్తుండగా అధికారులు పట్టుకొని, తహసీల్ కార్యాలయం వద్ద డంప్ చేశారు. ఈ ఇసుకకు వేలంపాట నిర్వహించగా భారీ స్పందన వచ్చింది. పోటీ పెరగడంతో టిప్పర్ ఇసుకను రెంజల్‌కు చెందిన ఒకరు రూ.13 వేల 800 దక్కించుకున్నారు. ఇసుక సిండికేట్‌కు పలువురు చెక్‌పెట్టడంతో అధిక ధర పలికి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని పలువురు భావిస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

భీమ్‌గల్: భీమ్‌గల్‌లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఎస్సై రాజ్‌భరత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి జక్లత్ ఒర్రె వద్ద గస్తీ నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని పరిశీలించగా ప్లాస్టిక్ కవర్‌లో ఎండు గంజాయి దొరికింది. నిందితులు భీమ్‌గల్ నందిగల్లి ప్రాంతానికి చెందిన జంబుక శివ(21), బెజ్జోర గ్రామానికి చెందిన ఎర్రోల్ల రోహన్(19), జుబైనల్ కలిసి కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ ప్రాంతానికి చెందిన కొండ రాజేష్ వద్ద ఈ నెల 9న రూ.10 వేలు విలువ చేసే ఎండు గంజాయిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముప్కాల్ ఎంపీపీ భర్తపై దాడి

బాల్కొండ: ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సామ వెంకట్‌రెడ్డిపై సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గడ్డం సంతోష్‌రెడ్డి, ఆయన తమ్ముడు గడ్డం దిలీప్‌రెడ్డి, కుమారుడు గడ్డం సాయారెడ్డి దాడి చేశారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సంతోష్‌రెడ్డి తన తమ్ముడు, కుమారుడితో కలిసి గ్రామంలో ప్రధాన వీధి వద్ద నిల్చొని ఉన్న వెంకట్‌రెడ్డిపై కర్రలు, రాళ్లతో దాడి చేశాడు. తలపై బాది అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులు ఇద్దరు పోలీసుల అదుపులో ఉండగా ఒకరు పరారిలో ఉన్నట్లు తెలిపారు. కాగా ముప్కాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులపై వరుస పెట్టి దాడులు జరుగుతుండటంపై చర్చనీయంశమైంది. 20 రోజుల క్రితం ముప్కాల్ జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ ఇంటిపై రాళ్లతో దాడి చేసి ఇంటి అద్దాలను పగుల గొట్టారు. దీంతో గ్రామంలో రాజకీయ కక్షలు సాగుతున్నాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నిజామాబాద్ క్రాస్ రోడ్డు వద్ద విజయ్ ఫొటో స్టూడియోలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి ఇద్దరు దొంగలు ఫొటో స్టూడియో తాళాలు ధ్వంసం చేసి డీఎస్ఎల్ఆర్ కెమెరా, చిన్న కెమెరా, ల్యాప్‌టాప్, హార్డ్‌డిస్క్, లెన్స్‌లతో పా టు కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

భిక్కనూరు: భిక్కనూర్ టోల్‌ప్లాజా సమీపంలోని ఉన్న వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు సోమవారం వేకువ జామున ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ లోపల ఉన్న రాగి కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు.

మల్లూర్ మీసేవలో..

నిజాంసాగర్: మండలంలోని మల్లూర్ గ్రామంలో ఉన్న మీసేవ కేంద్రంలో ఆదివారం చోరీ జరిగింది. కౌంటర్ ఉంచిన రూ.20 వేల నగదుతో పాటు డ్యాకుమెంట్లను ఎత్తుకెళ్లినట్లు మీసేవ నిర్వాహకుడు మహిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

రాజన్న గుడి ఆవరణలో భక్తుడి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వెళ్లిన ఓ భక్తుడు ఆలయ ఆవరణలోనే మరణించాడు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన సాయిలు కుటుంబ సభ్యులతో కలసి సోమవారం వేములవాడకు వెళ్లాడు. రాజన్నను దర్శించుకున్న కాసేపటికే ఆలయ ఈవో ఆఫీస్ వద్ద మూర్ఛవ్యాధితో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, భక్తులు ప్రాథమిక చికిత్స అందించేందుకు యత్నించినప్పటికీ సమయానికి వైద్యం అందకపోవడంతో సాయిలు ప్రాణాలు కోల్పోయాడు. రాజేశ్వరపురం వసతి గదుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే సాయిలు మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



రహమాన్(ఫైల్)

బిచ్కుంద: మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే హఫీజూర్ రహమాన్(60) టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఢీకొనడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 13న రాత్రి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో చాయ్ తాగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న హఫీజూర్ రహమాన్‌ను వెనుక నుంచి చెన్నూరి రమేశ్ టీవీఎస్ ఎక్సెల్‌తో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ రహమాన్‌ను స్థానికులు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. మృతుడి భార్య హజర బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

రామారెడ్డి: మతిస్థిమితం లేని యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొలుపుల రాకేష్(18)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఆయన అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లి నాలుగైదు రోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 14న గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం రామారెడ్డి పటేల్ చెరువులో ఆయన మృతదేహం లభ్యమైంది. మృతుడి మామ భూమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఒకరి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ అయిదురోజుల క్రితం నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. రాత్రి అయిన ఇంటికి చేరుకోలేదు. అప్పటినుంచి కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి రవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.